క్లుప్తంగా

అక్రమ మద్యం తరలిస్తున్న 9 మంది అరెస్టు



మద్యం బాటిళ్లు, కార్లు, నిందితులతో ఎస్‌ఈబీ అధికారులు

నల్లజర్ల: యానాం నుంచి మద్యం అక్రమ రవాణా చేస్తున్న వారిని ఎస్‌ఈబీ అధికారులు అనంతపల్లి టోల్‌ప్లాజా వద్ద బుధవారం రాత్రి అరెస్టు చేశారు. దేవరపల్లి ఎస్‌ఈబీ సీఐ డి.సుధ గురువారం అందించిన వివరాల ప్రకారం.. రెండు కార్లలో యానాం నుంచి 9 మంది 19 మద్యం ఫుల్ బాటిళ్లను తరలిస్తున్నట్టు ఎస్‌ఈబీ వర్గాలకు సమాచారం అందింది. ఈ క్రమంలో అనంతపల్లి టోల్‌ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, రెండు కార్లలో 19 మద్యం బాటిళ్లు లభించాయి. వీటిని స్వాధీనం చేసుకుని, 9 మందిని అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు.

16న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి మహోత్సవం

కొవ్వూరు: పట్టణంలో ఏటిగట్టుపై ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి మహోత్సవాలు ఈ నెల 16 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకుడు దేవరకొండ సాయిప్రసాద్ తెలిపారు. శనివారం ఉదయం మహా గణపతి పూజ, కలశ పూజ, మండపారాధన, సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. 17న ఆదివారం గోదావరి జలాలతో వేలాయుధపూజ, కుజ, సుదర్శన, మూలమంత్ర సహిత కాలసర్ప, సుబ్రహ్మణ్య లక్ష్మీగణపతి హోమం, రాజశ్యామల హోమం, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. 18న సాయంత్రం వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామని తెలిపారు.

షష్ఠి ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు

దేవరపల్లి: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి మహోత్సవాలకు దేవరపల్లి మండలంలో ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ నెల 15 నుంచి 20 వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దేవరపల్లిలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. 15న ఉదయం 7.30కు స్వామివారికి పాలకావడి సేవ జరుగుతుంది. మేళతాళాలతో, బాణసంచాతో గ్రామంలో వేంచేసిన వివిధ ఆలయాలకు భక్తులతో దర్శించి, తదుపరి స్వామివారికి పాలకావిడి సేవాభిషేకం నిర్వహిస్తారు. 17న రాత్రి 7 గంటలకు స్వామివారి కల్యాణం, 18న ఉదయం 5కు స్వామివారి దివ్య దర్శనం ఉంటుంది. 21న ఉదయం 11 గంటలకు అన్న సమారాధన జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

అనసూయకు మహిళా ప్రజాప్రతినిధుల సన్మానం



అనసూయను సన్మానిస్తున్న మహిళా ప్రజాప్రతినిధులు

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన దేవరపల్లి మండలం చిన్నాయగూడేనికి చెందిన ఆచంట అనసూయను గురువారం సాయంత్రం స్థానిక సంస్థల మహిళా ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. చిన్నాయగూడెంలోని ఆమె గృహానికి వెళ్లి జెడ్పీటీసీ పొట్టి స్వర్ణలత, మండల మహిళా అధ్యక్షురాలు కడలి హైమావతి, పలువురు మహిళా ఎంపీటీసీలు అభినందనలు తెలిపారు.

జాతీయ కరాటే పోటీలకు తక్షిత్ ఎంపిక



తక్షిత్‌ను అభినందిస్తున్న ట్రైనర్ రాధ

కొవ్వూరు: స్కూలు గేమ్స్‌లో కొవ్వూరు పట్టణంలో అవీ వర్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీకి చెందిన బి.తక్షిత్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నవంబర్ 10, 11 తేదీల్లో విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం జోగింపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి అండర్–14 విభాగంలో కుమిటె 60 కిలోల విభాగంలో రాష్ట్రం తరఫున ఈ పోటీలకు ఎంపికైనట్టు కరాటే ట్రైనర్ ఆళ్ల రాధ తెలిపారు. ఈ నెల 16 నుంచి 19 వరకు న్యూఢిల్లీలో ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు.

మూడో రోజుకు చేరిన సమ్మె

పెరవలి: తమ డిమాండ్లు ఆమోదించాకే నిరవధిక సమ్మెను విరమిస్తామని అంగన్‌వాడీ సంఘ ప్రతినిధులు తెలిపారు. పెరవలి తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీలకు టీడీపీ, జనసేన, బీఎస్పీ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు దుర్గ, రామలక్ష్మి, విజయ, పుణ్యవతి పాల్గొన్నారు.

తాళ్లపూడి: తమ డిమాండ్ల సాధనకు అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె గురువారం కొనసాగింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. ఈ ఆందోళనలో నాయకులు బట్టు దుర్గ, సెక్టార్ లీడర్లు భాస్కరం, సుజాత, ఉమ, దయామణి తదితరులు పాల్గొన్నారు.

మెరుగుపడిన పేదల జీవన ప్రమాణాలు

- ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు
- కాటకోటేశ్వరంలో గ్రామ సచివాలయం, ఆర్‌బీకే భవనాలు ప్రారంభం



కాటకోటేశ్వరంలో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, పార్టీ శ్రేణులు

నిడదవోలు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో నిరుపేదల కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. నిడదవోలు మండలం కాటకోటేశ్వరం గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించి, శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి అంటే భవంతులు కట్టడమే కాదని, ప్రజలకు సంక్షేమ పాలన అందించడం కూడా అభివృద్ధేనన్నారు.

మోడల్ విలేజ్‌గా అభివృద్ధి

కాటకోటేశ్వరం గ్రామాన్ని ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రకారమే మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. నాలుగున్నరేళ్లుగా రూ.23.78 కోట్ల సంక్షేమ పథకాలు అందించడంతో పాటు రూ.6.73 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. ఉనకరమిల్లి గ్రామంలో సీసీ డ్రెయిన్ నిర్మించి, ములపలవారి కుంట మురుగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించామని చెప్పారు.

మద్దతు పలకండి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అవినీతి రహిత పాలన అందిస్తున్నామని, లబ్ధిదారుల ఖాతాల్లోకే నేరుగా సంక్షేమ లబ్ధి అందిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రానున్న కాలంలో మరింత అభివృద్ధి చేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలు మద్దతు పలకాలని కోరారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా అందుతున్న సేవలపై ప్రజలంతా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉనకరమిల్లి సర్పంచ్ భారతీలక్ష్మి, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ కొయ్యే సూరిబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, ఎంపీటీసీ పెనుగుర్తి రాము, సొసైటీ అధ్యక్షులు గుంటుపల్లి కృష్ణమూర్తి, యాళ్ల రామారావు, పార్టీ నాయకులు తిరుమలశెట్టి అయ్యప్ప, పోలిరెడ్డి శివరామకృష్ణ, ఎంపీడీఓ పి.శామ్యూల్, పంచాయతీ కార్యదర్శి బి.మనోజ్‌ప్రకాష్ పాల్గొన్నారు.



కాటకోటేశ్వరంలో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

పేదల సొంతింటి కల సాకారం

నిడదవోలు రూరల్: పేదల సొంతింటి కలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని కాటకోటేశ్వరంలో వైఎస్సార్ జగనన్న కాలనీలో లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలకు గురువారం ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాటకోటేశ్వరం, ఉనకరమిల్లి గ్రామాల పరిధిలో 275 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్లు మంజూరు చేశామన్నారు. లబ్ధిదారులంతా త్వరగా ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. రాయితీపై సిమెంట్, ఐరన్‌తో పాటు ఇసుక, బిల్డింగ్ మెటీరియల్ అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ కొయ్యే సూరిబాబు, ఎంపీటీసీ పెనుగుర్తి రాము, సర్పంచ్ పోలిరెడ్డి భారతీలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు గుంటుపల్లి కృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు పాల్గొన్నారు.

అదనపు రుణం మంజూరు చేయాలి



మేనేజరుకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

దేవరపల్లి: మిచాంగ్ తుపాను కారణంగా పొగాకు తోటలకు దెబ్బతినడం వల్ల తీవ్రంగా నష్టపోయామని, దెబ్బతిన్న తోటలను రికవరీ చేయడానికి పెట్టుబడి అవసరం ఉందని రైతులు తెలిపారు. బ్యారన్‌కు రూ.2 లక్షల అదనపు పెట్టుబడి అవుతుందన్నారు. ఇప్పటికే పూర్తిగా పెట్టుబడి పెట్టి తోటలు పెంచగా, భారీ వర్షాలకు ఇసుకమేటలు వేసి దెబ్బతిన్నట్టు రైతులు తెలిపారు. అదనపు ఖర్చులకు బ్యారన్‌కు రూ.2 లక్షలు పెట్టుబడి అవుతుందని, బ్యాంకుల ద్వారా రుణం మంజూరు చేసి రీషెడ్యూల్ చేయాలని రైతులు బ్యాంకు అధికారులు, బోర్డు అధికారులను కోరారు. గురువారం యర్నగూడెంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజరు సురేంద్రకుమార్‌ను పొగాకు రైతులు కలిసి తమ ఇబ్బందులను వివరించారు. రైతులను ఆదుకోవాలని, బయట అధిక వడ్డీల వల్ల తమపై భారం పడుతుందన్నారు. ఎస్ఎల్‌బీసీ ద్వారా బ్యాంకులకు తక్షణం ఆదేశాలు ఇవ్వాలని రైతులు కోరారు. దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం రైతు సంఘ అధ్యక్షుడు కరుటూరి శ్రీనివాస్, రైతులు నరహరిశెట్టి సుధాకర్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ప్రజలకు మాటిస్తే.. కచ్చితంగా నెరవేర్చే జగన్

- ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు
- ఉండ్రాజవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం



ఉండ్రాజవరంలో మహిళకు పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

ఉండ్రాజవరం: రాష్ట్ర ప్రజలకు మాటిస్తే, కచ్చితంగా నెరవేర్చే ముఖ్యమంత్రుల్లో ఆనాడు దివంగత సీఎం వైఎస్సార్ అయితే, ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే ఉన్నారని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. ఉండ్రాజవరంలోని గాంధీ బొమ్మల సెంటర్, కోటిపల్లి వారి వీధి, సాయిబాబా గుడి, చివటం రోడ్డులో గురువారం జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, సర్పంచ్ మెండే వెంకట్రావు ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. నాలుగున్నరేళ్లలో ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని సంక్షేమ బావుటా బుక్‌లెట్లతో వివరించారు. ప్రజల ఆశీర్వాదమే తమ ప్రభుత్వానికి బలమన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని, పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాల లబ్ధిని నేరుగా కులమత, రాజకీయ పార్టీలకతీతంగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేశారన్నారు. ఎంటువంటి అవినీతి లేకుండా పాలన సాగిస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరహరశెట్టి సరోజ, ఎంపీటీసీ గాడి కృష్ణఫర్, సొసైటీ అధ్యక్షుడు సంకురాత్రి సుబ్బారావు, వార్డు మెంబర్లు ఊబ మంగ, వి.కల్యాణదేవి, సచివాలయ కన్వీనర్లు దోనేపూడి సుధాకర్, నాగళ్ల రాజేష్, ఎం.అనంతలక్ష్మి, చిక్కాల అశోక్, జైవరపు గంగాధర్, వి.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పాల బాటిళ్లు పంపిణీ

నిడదవోలు : పట్టణంలోని రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో గురువారం వ్యాధి నివారణ, వైద్యం అనే అంశంలో భాగంగా సంచార ప్రజలకు పోలియోవ్యాధి నివారణపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదేళ్ల చిన్నారులకు పాల బాటిళ్లను పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, సభ్యులు గోపిరెడ్డి శ్రీనివాస్, కారింకి సాయిబాబు, ఆకుల ముకుందం, కాళ్ల రాంబాబు, గుంటుపల్లి శివకుమార్, పొలాదాసు శ్రీనివాస్, గొన్నాబత్తుల రామరావు, కొత్తపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

20న వేంకటేశ్వరుని కల్యాణ మహోత్సవం



కల్యాణ మహోత్సవ నిర్వహణపై మాట్లాడుతున్న గాదిరాజు వెంకటసుబ్బరాజు

కొవ్వూరు: టీటీడీ ఆధ్వర్యంలో ఈ నెల 20న కొవ్వూరు సంస్కృత పాఠశాల ప్రాంగణంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహించనున్నట్టు దేవస్థాన ట్రస్టు బోర్డు మెంబర్ గాదిరాజు వెంకట సుబ్బరాజు తెలిపారు. ఈ ఏర్పాట్లలో భాగంగా టీటీడీ బృందంతో కలిసి పాఠశాల ప్రాంగణాన్ని ఆయన పరిశీలించారు. దొమ్మేరులో వేంకటేశ్వరస్వామి దేవస్థానం నిర్మించాలని స్థానిక నాయకులు కోరారు. దీంతో ఆయన అనువైన స్థలాలను పరిశీలించారు. కల్యాణ మహోత్సవం ఏర్పాట్లపై శుక్రవారం సాయంత్రం ఐదుకు సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్టు ఆంధ్రా గీర్వాణ విద్యా పీఠం కార్యదర్శి టీఎస్‌వీ రమణమూర్తి తెలిపారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, పేరిచెర్ల బోసురాజు, గంధం శేషసాయి, పురోహితుడు మానేపల్లి సుబ్రహ్మణ్యశర్మ తదితరులు ఉన్నారు.

ఫీల్డ్ లేబర్ సొసైటీ సభ్యుల ఆందోళన

తాళ్లపూడి: బల్లిపాడు ఓపెన్ ఇసుక ర్యాంపు వల్ల తమ సొసైటీకి చెందిన భూముల్లో పంటలు దెబ్బతిని, జీవనోపాధి కోల్పోతున్నామని వేగేశ్వరపురం ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు ఆరోపించారు. గురువారం సొసైటీ సభ్యులు బల్లిపాడు రీచ్ వద్ద ఆందోళన చేశారు. రెండు రోజులుగా ఈ రీచ్‌ని ఆనుకుని ఉన్న చిడిపి గ్రామానికి చెందిన దళిత రైతులు తమ భూముల్లో తవ్వకాలు ఆపాలని నిరసన కొనసాగిస్తుంటే, తాజాగా వేగేశ్వరపురం రెవెన్యూ పరిధిలోకి వచ్చే భూముల రైతులు కూడా ఆందోళన చేస్తున్నారు. అధికారులు, నాయకులు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు దాకే సత్యనారాయణ, కార్యదర్శి కావూరి లక్ష్మణరావు, సభ్యులు కొల్లి తాతారావు, కావూరి నరసయ్య, కత్తుల లక్ష్మణరావు, అక్కాబత్తుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు తెరిచేలా చర్యలు



నల్లజర్లలో అధికారుల సమక్షంలో అంగన్‌వాడీ కేంద్రం తాళాలు తొలగిస్తున్న దృశ్యం



దేవరపల్లి మండలం గొల్లగూడెం అంగన్‌వాడీ కేంద్రం వద్ద పిల్లలకు భోజనం పెడుతున్న ఉద్యోగులు

నల్లజర్ల: మండలంలో మూసివేసిన 84 అంగన్‌వాడీ కేంద్రాలను తెరిచేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ రాజశేఖరం గ్రామ కార్యదర్శులు, వీఆర్వోలు, మహిళా సంరక్షణ కార్యదర్శులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వీరితో ఎంపీడీఓ, ఎస్సై, విద్యాశాఖ అధికారులు, ఈఓపీఆర్డీలు సమావేశమయ్యారు. అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు కేంద్రాలు మూసివేసి, ఆందోళన చేస్తున్న దృష్ట్యా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వెంటనే సెంటర్లు తెరవాలని పేర్కొన్నారు. కార్యకర్తలుంటే తాళాలు అడగాలని, లేకుంటే తాళాలు పగులగొట్టి కేంద్రాలు ఎట్టి పరిస్థితుల్లోను తెరిచి, పిల్లలకు భోజన సౌకర్యం కల్పించాలన్నారు. వీఆర్వో, మహిళా సంరక్షణాధికారి, గ్రామ కార్యదర్శి సమక్షంలో తాళాలు తీసి, పంచనామా నిర్వహించాలన్నారు. ఒక్కో కేంద్రాన్ని ముగ్గురు వలంటీర్లకు అప్పగించాలన్నారు. అక్కడ ఇంటింటికీ వెళ్లి పిల్లలను తెచ్చి, భోజనాలు వడ్డించాలన్నారు. పాఠశాలల వద్ద ఉన్న కేంద్రాలను విద్యా సహాయకులకు బాధ్యతలు అప్పగించాలన్నారు. ఆయా కేంద్రాల పరిధిలోని తల్లులకు కేంద్రాలు పనిచేస్తున్నాయన్న విషయం తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో ఎస్సై నరసింహమూర్తి, విద్యా శాఖాధికారులు సత్యనారాయణ, భగవతి, ఈఓపీఆర్డీ సింహాద్రి, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం విజయనిర్మల కుమారి, తహసీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ రాధాబాయ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వెంకటలక్ష్మి, కృష్ణవేణి, భారతి పాల్గొన్నారు. ఇలాఉండగా అంగన్‌వాడీ కేంద్రాల బాధ్యతలను దాదాపు అన్నిచోట్లా వలంటీర్లకు అప్పగించారు. వీటి నిర్వహణకు అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

అంగన్‌వాడీ పిల్లలకు భోజన ఏర్పాటు

దేవరపల్లి: అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె చేస్తుండడంతో మూతబడ్డ కేంద్రాలను అధికారులు తెరిపించారు. గురువారం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు బాధ్యతలు అప్పగించారు. పిల్లలకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంటలు చేయించి, అంగన్‌వాడీల్లోని పిల్లలకు భోజన ఏర్పాట్లు చేశారు. మహిళా పోలీసులను ఇన్‌చార్జిలుగా నియమించారు. శుక్రవారం నుంచి అన్ని అంగన్‌వాడీ కేంద్రాల వద్ద వంటలు చేయనున్నారు. ఎంపీడీఓ ఆధ్వర్యంలో పిల్లలకు భోజన ఏర్పాట్లు చేశారు. దేవరపల్లి మండలంలో 79 అంగన్‌వాడీ కేంద్రాలు, గోపాలపురం మండలంలో 70 కేంద్రాలున్నాయి.

ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోండి

- పశు సంవర్ధక శాఖ డీడీ రాధాకృష్ణ
- కలవలపల్లిలో లేగదూడల ప్రదర్శన, వైద్యశిబిరం



కలవలపల్లిలో ప్రదర్శనకు తెచ్చిన లేగదూడలు

చాగల్లు: పాడిరైతులు ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డా.జి.రాధాకృష్ణ అన్నారు. కలవలపల్లి పశు వైద్యశాలలో గురువారం పశు సంవర్ధక శాఖ, పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన, ఉచిత పశు వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభకు సర్పంచ్ ఆకుల లక్ష్మి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి డా.రాధాకృష్ణ మాట్లాడుతూ పాడి రైతులకు ఇంటి ముంగిటకే పశు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. కలవలపల్లి సొసైటీ అధ్యక్షుడు గూడపాటి శివ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయంతో పాటు పశుపోషణపై ప్రత్యేక శ్రద్ధతో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు.

బహుమతుల అందజేత

లేగదూడల ప్రదర్శనలో శారీరాకృతి, వయసు తదితర అంశాల ఆధారంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. వీరవల్లి కృష్ణారావుకు చెందిన లేగదూడకు ప్రథమ బహుమతి లభించింది. పరిసర గ్రామాల నుంచి 55 లేగదూడలను తీసుకొచ్చారు. అనంతరం పశు వైద్య శిబిరంలో పశువులకు గర్భకోశ వ్యాధికి వైద్య సేవలందించారు. కలవలపల్లి సొసైటీ సహకారంతో మినరల్ మిక్చర్‌ను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పశు గణాభివృద్ధి అధికారి జి.ఏసురత్నం, ఏడీ ఎ.వెంకటరెడ్డి, పశు వైద్యాధికారి ఎంఎం రాజేష్, ఎంపీటీసీ ముళ్లపూడి గంగాభవాని, ఉప సర్పంచ్ కొండేపాటి హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న దైవజనులు, విశ్వాసులు

నిడదవోలు రూరల్: మునిపల్లి పెనుయేలు ప్రార్థన మందిరంలో క్రిస్మస్ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పాస్టర్ కె.రమేష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన క్రిస్మస్ సంబరాల్లో దైవజనులు బిషప్ మల్లిపూడి హరత్‌బాబు, చోళ్ల సాలోమాన్‌రాజు కేక్ కట్ చేశారు. యూత్ సభ్యులు క్రిస్మస్ నాటికలు, నృత్యాలు ప్రదర్శించారు.

జగనన్నతోనే సామాజిక, ఆర్థికాభివృద్ధి

- పోతవరంలో వై ఏపీ నీడ్స్ జగన్



నిడదవోలు మండలం రావిమెట్లలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న పల్లారావు, ప్రజాప్రతినిధులు



యాదవోలు సచివాలయం వద్ద పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ దుర్గారావు

నల్లజర్ల: రాష్ట్రంలో సామాజిక, ఆర్థికాభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని నల్లజర్ల జెడ్పీటీసీ ముప్పిడి లక్ష్మి అన్నారు. పోతవరం సచివాలయం–2లో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. సర్పంచ్ నూతికుర్తి లక్ష్మణరావు, ఎంపీటీసీ చిడిపి చింతయ్య అధ్యక్షత వహించారు. గ్రామంలో రూ.32.55 కోట్లతో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల బోర్డును జెడ్పీటీసీ ఆవిష్కరించి, అనంతరం పార్టీ జెండాను ఎగురవేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం చేసిన మేలును ప్రతిఒక్కరికీ వివరించాలన్నారు. పార్టీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, జేసీఎస్ మండల కన్వీనర్ కఠారి రాజ్‌కుమార్, పిచ్చుకుల ప్రసాద్, అబ్బూరి రాజయ్య, గద్దే వెంకటేశ్వరరావు, ముక్తార్, గద్దే రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నెలటూరులో 'వై ఏపీ నీడ్స్ జగన్'

చాగల్లు: మండలంలో నెలటూరు సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం వద్ద ప్రజలకు అందించిన పథకాల బోర్డును ఆవిష్కరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. లబ్ధిదారులకు బుక్‌లెట్లను అందజేశారు. పార్టీ నాయకులు పల్లె నిద్ర చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు జుట్టా ఏడుకొండలు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, ఎంపీటీసీ తాళ్లూరి రమ్య, ఎస్‌కే పాషా, స్థానిక నాయకులు గేడా శ్యామ్, తాళ్లూరి దామోదరం, బొర్రా రజనీప్రసాద్, వుండవల్లి శ్రీనివాస్, కుడప రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ లబ్ధిని అందించిన జగన్

తాళ్లపూడి: అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేశారని ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు అన్నారు. పోచవరం సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించి, పథకాల బోర్డును ప్రారంభించారు. సర్పంచ్ కాకర్ల హేమలత, పార్టీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, నాయకులు వల్లభశెట్టి శ్రీనివాస్, రామకృష్ణ, పిట్టా శ్రీనివాస్, నాని, యాళ్ల బాబురావు, గుంటు చిన్నబ్బాయి పాల్గొన్నారు.

మళ్లీ జగనన్ననే గెలిపించుకుందాం..

ఉండ్రాజవరం: రాబోయే ఎన్నికల్లో మరోసారి సీఎంగా జగనన్ననే గెలిపించుకుందామని జెడ్పీటీసీ నందిగం భాస్కర రామయ్య అన్నారు. వెలగదుర్రు సచివాలయ పరిధిలో సర్పంచ్ సాగి పద్మావతి, ఉప సర్పంచ్ సాగి రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ జరిగింది. గ్రామంలో సంక్షేమ, అభివృద్ధి పనుల బోర్డును జెడ్పీటీసీ ఆవిష్కరించారు. పార్టీ పతాకాన్ని వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు ఇందుకూరి మురళీకృష్ణారాజు ఎగురవేశారు. ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి మాట్లాడారు. ఎంపీటీసీ ధనిశెట్టి భ్రమరాంబ, ముదునూరి రామకృష్ణంరాజు, చోళ్ల శ్రీను, పి.చిన్న, వీరవల్లి విఘ్నేశ్వరరావు, చిటికెన వెంకటేశ్వరరావు, కాకరపర్తి సుబ్బారావు, నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, అబ్బిన రాంబాబు, శరత్‌బాబు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి జగనన్నకు అండగా ఉందాం

నిడదవోలు రూరల్: సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు కోరారు. రావిమెట్ల–శంకరాపురం గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ నిర్వహించారు. రావిమెట్ల పరిధిలో రూ.19.78 కోట్ల సంక్షేమ పథకాలు, రూ.7.79 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల బోర్డును పల్లారావుతో పాటు ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ కొయ్యే సూరిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, సర్పంచ్ కాల్దారి సూర్యకుమారి ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను పల్లారావు ఎగురవేశారు. తటస్థ ఓటర్లతో సమావేశం నిర్వహించారు. పార్టీశ్రేణులు పల్లెనిద్ర చేశారు. ఎంపీటీసీ ఉప్పులూరి తేజశ్రీ, పార్టీ నాయకులు ఉప్పులూరి రామకృష్ణ, చిలుకూరి చిట్టిప్రసాద్, కాల్దారి శ్రీను, మిద్దే శ్రీను, పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు, గృహసారథులు పాల్గొన్నారు.

దేవరపల్లి: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు జరగాలంటే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరలా రావాలని ఎంపీపీ కేవీకే దుర్గారావు అన్నారు. యాదవోలు గ్రామ సచివాలయం–1 వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ జరిగింది. ఎంపీపీ దుర్గారావు మాట్లాడుతూ గ్రామంలో నాలుగున్నరేళ్లలో రూ.34 కోట్లతో సంక్షేమ పథకాలు, రూ.30 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్టు చెప్పారు. సచివాలయంలో పథకాల బోర్డును ఎంపీపీ ఆవిష్కరించారు. పార్టీ పతాకాన్ని ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు ఎగురవేశారు. గ్రామంలో పల్లెనిద్ర చేశారు. సర్పంచ్ సున్నం వరప్రసాద్, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఆచంట అనసూయ, జెడ్పీటీసీ పొట్టి స్వర్ణలత, ఎంపీటీసీ తమ్మిశెట్టి నాగప్రసన్న, కొమారపు హారాకాజ్యోతి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరేటి సూర్యనారాయణ, నియోజకవర్గ అధికార ప్రతినిధి గడా జగదీష్, మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ కుసులూరి వెంకటసతీష్, నాయకులు అనిశెట్టి సూర్యచంద్రం, కడలి హైమావతి, విసాకోడేటి కోటేశ్వరరావు, అనిశెట్టి సర్వారాయుడు పాల్గొన్నారు.



నెలటూరులో పతాకావిష్కరణ చేస్తున్న నాయకులు



పోతవరంలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ



వెలగదుర్రులో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ

కెనరా బ్యాంక్ Canara Bank | యాదవోలు బ్రాంచ్ (1539), యాదవోలు, తూ||గో|| జిల్లా. ✆ 8331015655.

బంగారు నగల వేలం ప్రకటన

[illegible]

ఖాతా నెంబరు	ఖాతాదారుని పేరు మరియు చిరునామా	నగల బరువు
1539836002453	పెద్దిరెడ్డి సత్యనారాయణ, తండ్రి: చిన్న అప్పారావు, యాదవోలు, దేవరపల్లి	51.7 గ్రాములు

[illegible]

తేది: 15-12-2023, ప్రదేశం: యాదవోలు | సం/- బ్రాంచ్ మేనేజర్, కెనరా బ్యాంక్

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నిడదవోలు డివిజన్

90102 34548 (కొవ్వూరు)
90100 51493 (నిడదవోలు)
90100 68395 (గోపాలపురం)

Office mail : tpgadvt@gmail.com